క్లుప్తంగా

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకుంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. కొందరు భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు ఆలయం ఆవరణలోనే పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే జైలుకే..

కౌతాళం: ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మంగళవారం అందరూ ప్రశాంతంగా ఉండలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్, 30పోలీస్ యాక్ట్, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో గుంపులుగా ఉండరాదన్నారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని బాణసంచా కాల్చడం, బైక్ ర్యాలీలు చేయడం, బైక్‌ల సైలెన్సర్లు తీసి నడపడం వంటివి చేయకూడదన్నారు. గెలిచిన, ఓడిన వారిని కించపరిచే విధంగా లేదా మనోభావాలను దెబ్బతీసే విధంగా అభ్యంతర పోస్టులను సోషల్ మీడియాలో పెట్టరాదన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. యువత ఎన్నికల కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఆనంద్‌బాబు

ఆదోని రూరల్: ఈనెల 28, 29 తేదీల్లో ఆదోనిలో జరిగే సామాజిక చైతన్య శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఆనంద్‌బాబు కోరారు. ఈ మేరకు సోమవారం కేవీపీఎస్ ఆదోని మండల, పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి దళితులు ఆర్థికంగా, సామాజిక సమానత్వానికి నోచుకోక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రిజర్వ్‌డ్ స్థానాల నుంచి గెలుపొందిన ఎస్సీ ప్రజాప్రతినిధులకు సైతం ఆ బాధలు తప్పడం లేదన్నారు. సామాజిక తరగతుల మధ్య ఐక్యత, చైతన్యం పోరాటాల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు ఉన్న సామాజిక ఉద్యమకారులందరినీ సమీకరించి ఈనెల 28, 29 తేదీల్లో ఆదోనిలో సామాజిక చైతన్య శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. తరగతుల జయప్రదానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. కేవీపీఎస్ ఉపాధ్యక్షులు కడితో దావీద్, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పి.ఎస్.గోపాల్, మండల అధ్యక్ష కార్యదర్శులు మునిస్వామి, తిక్కప్ప, పట్టణ నాయకులు మల్లికార్జున, యువరాజు, లక్ష్మన్న, చక్రవర్తి, తాయన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లను అరికట్టాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి

ఆదోని సెంట్రల్: అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై తగు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్మిషన్ల పేరుతోను, పుస్తకాల పేరుతో వేలకు వేలు ఫీజులు వసులు చేస్తున్నారని ఆరోపించారు. ధనార్జనే ధ్యేయంగా కొన్ని విద్యాసంస్థలు పని చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో అందోళన చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే



మున్సిపల్ హైస్కూల్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు (ఫైల్)

ఆదోని టౌన్: మే నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడికానున్నాయి. జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ జి.సృజన, ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ మేరకు ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు చెబుతున్నారు. మరికొన్ని గంటల వ్యవధిలో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. దీంతో ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి, కాంగ్రెస్ అభ్యర్థి రమేష్‌యాదవ్‌తో పాటు స్వతంత్ర్య అభ్యర్థులు ఏడుగురు పోటీలో నిలిచారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, కూటమి అభ్యర్థుల మధ్యనే పోటీ నెలకొంది. దీంతో ఆ పార్టీల అభ్యర్థుల గుండెల్లో గుబులు రేపుతోంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సాయి ప్రసాద్‌రెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందే అవకాశాలు ఉన్నాయని, పార్టీ శ్రేణులు, అభిమానులు దీమా వ్యక్తం చేస్తున్నారు.

ఆదోని నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గంలో మొత్తం 2,63,058 మంది ఓటర్లు ఉన్నారు. అందులో స్త్రీలు 1,32,642 మంది ఉండగా, పురుషులు 1,30,364 మంది, ఇతరులు 52 మంది ఉన్నారు. అందులో 1,75,064 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 87,949 మంది కాగా, స్త్రీలు 87096 మంది, ఇతరులు 19 మంది ఉన్నారు. ఆదోని నియోజకవర్గంలో మొత్తం మీద 66.55 శాతం పోలింగ్ నమోదైంది.

ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ల ఏర్పాటు

ఆదోని నియోజకవర్గానికి సంబంధించి కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ ఏర్పాటు చేశారు. మొత్తం 14 టేబుళ్ల 14 రౌండ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 8:30 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుంది.

భారీ పోలీస్ బందోబస్తు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆదోనిలో డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఆర్‌పీఎఫ్‌కు చెందిన బెటాలియన్ నుంచి 100 మంది, డీఎస్పీ ఒకరు, సీఐలు 8 మంది, 12 మంది ఎస్ఐలు, 180 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీసులు, మహిళా పోలీసులకు విధులు కేటాయించారు. అవాంఛనీయ సంఘటనలను అడ్డుకునేందుకు టియర్ గ్యాస్‌ను సిద్ధంగా ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఉపేక్షించబోమని డీఎస్పీ హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో గుంపులు గుంపులుగా ఉండరాదని, 144 సెక్షన్, పోలీసు 30 యాక్ట్ అమల్లో ఉందన్నారు. ప్రశాంతంగా కౌంటింగ్ జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

ఇబ్రహీంపురంతో మొదలు.. కుర్నూరుతో ముగింపు

- ఆపై అభ్యర్థి గెలుపు, మెజారిటీ ప్రకటన

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎమ్మిగనూరు అసెంబ్లీకి నమోదైన ఓట్ల లెక్కింపు మంగళవారం కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో జరుగనుంది. ఇందులో భాగంగా మొదటి రౌండ్‌లో నందవరం మండలం ఇబ్రహీంపురం గ్రామంతో లెక్కింపు మొదలై నదికైరవాడి, నందవరం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గంగవరం, జొహరాపురం, నాగలదిన్నె, రెండవ రౌండ్‌లో గురజాల, రాయచోటి, మిట్టసోమాపురం, టి.సోమలగూడూరు, పొనకలదిన్నె, కనకవీడు, 3వ రౌండ్‌లో కనకవీడు పేట, నందవరం, పూలచింత 4వ రౌండ్‌లో మాచాపురం, హలహర్వి, ధర్మాపురం, హెచ్.బాపురం, జగ్గాపురం, ముగతి 5వ రౌండ్‌లో ముగతిలోని రెండు పోలింగ్ బూత్‌లు, ఎమ్మిగనూరు మండలంలోని సోగనూరు, కె.తిమ్మాపురం, టీఎస్ కూలూరు, దైవందిన్నె, ఏనుగుబాల, 6వ రౌండ్‌లో పెసలదిన్నె, గార్లదిన్నె, పార్లపల్లి, గువ్వలదొడ్డి, కలుగొట్ల, కె.నాగలాపురం, ఎమ్మిగనూరు పట్టణంలోని 82, 83, 83 బూత్‌ల ఓట్ల లెక్కింపు జరుగనుంది. 7వ రౌండ్‌లో ఎమ్మిగనూరు పట్టణంలోని 85వ బూత్ నుంచి 98 వరకు, 8వ రౌండ్‌లో 99వ బూత్ నుంచి 111 వరకు, 9వ రౌండ్‌లో 112వ బూత్ నుంచి 125 వరకు, 10వ రౌండ్‌లో 126 నుంచి 139 వరకు, 11వ రౌండ్‌లో 140వ బూత్ నుంచి 153 వరకు, 12వ రౌండ్‌లో 154వ పోలింగ్ బూత్ నుంచి 163 వరకు అదేవిధంగా కోటేకల్, కె.బసాపురం, 13వ రౌండ్‌లో బోడబండ, చెన్నాపురం, దేవిబెట్ట, బనవాసి, పరమాన్‌దొడ్డి, బనవాసిఫారం, మల్కాపురం, గుడికల్, 14వ రౌండ్‌లో గుడికల్‌లోని 182, 183, 184, 185 పోలింగ్ బూత్‌లతో పాటు, కడిమెట్ల, ఎర్రకోట, శిలార్‌దొడ్డి, రాళ్లదొడ్డి, కడివెళ్లలో రెండు బూత్‌లు, 15వ రౌండ్‌లో కడివెళ్ల 196వ బూత్, ఎస్.నాగలాపురం, కందనాతి, మాసుమాన్‌దొడ్డి, వెంకటగిరి, మసీదుపురం, గోనెగండ్ల మండలంలోని పెద్దమరివీడు, అలువాల, 16వ రౌండ్‌లో అలువాలలోని 210, 211బూత్‌లతో పాటు చిన్నమరివీడు, పెద్దనెలటూరు, చిన్ననెలటూరు, వేముగోడు, పుట్టపాశం, హెచ్.కైరవాడిలోని 223వ పోలింగ్ బూత్, 17వ రౌండ్‌లో హెచ్.కై రవాడిలోని మిగిలిన పోలింగ్ బూత్‌లు, కులుమాల, గోనెగండ్లలోని 233 నుంచి 237 వరకు బూత్‌లు, 18వ రౌండ్‌లో గోనెగండ్లలోని 238వ బూత్ నుంచి 248 వరకు, గంజిహళ్లి, 19వ రౌండ్‌లో అయ్యకొండ, బి.అగ్రహారం, బైలుప్పల, ఐరన్‌బండ, గాజులదిన్నె, ఎన్నెకండ్ల, పిల్లిగుండ్ల, నెరడుప్పల, ఎర్రబాడు, ఒంటెడుదిన్నె గ్రామాల ఓట్లు లెక్కించనుండగా చివరి 20వ రౌండ్‌లో బోడెపాడు, వీరంపల్లి, తిప్పనూరు, ఎస్.లింగందిన్నెలతో పాటు కుర్నూరు గ్రామ ఓట్లను చివరగా లెక్కించి అభ్యర్థి విజయం, మెజారిటీని ఎన్నికల అధికారులు తేల్చనున్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ కవాతు



ఆదోనిలో కవాతు చేస్తున్న పోలీసు బలగాలు

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సోమవారం డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. డీఎస్పీ శివనారాయణస్వామి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, సీఐలు తేజమూర్తి, గోపీ, నరసింహరాజు, మంజునాథ్, నిరంజన్‌రెడ్డి, విజయలక్ష్మి, ఎస్ఐలు మధుసూదన్, చిన్నపీరయ్య, శ్రీనివాసులతో పాటు పోలీసు బలగాలతో కవాతు చేశారు. నేడు కౌంటింగ్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరగకుండా కవాతు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. మంగళవారం కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరూ బయటికి రావొద్దన్నారు. తల్లిదండ్రులకు తమ పిల్లలను బయటకు పంపవద్దని, కౌంటింగ్ ఫలితాలను ఇళ్లలో టీవీలోనే చూడాలని సూచించారు. బయట గుంపులు గుంపులుగా సమావేశాలు ఏర్పాటు చేయరాదన్నారు. 144 సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్ అమల్లో ఉన్నందున గెలుపొందిన వారు విజయోత్సవ ర్యాలీలు, బాణసంచాలు పేల్చకూడదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంత్రాలయం ఏకపక్షమేనా?

- వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమంటున్న పరిశీలకులు
- 17 రౌండ్లలో ముగియనున్న ఓట్ల లెక్కింపు

మంత్రాలయం: సార్వత్రిక ఎన్నికలో పోటీకి దిగిన అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. కర్నూలు నగరంలోని రాయలసీమ యూనివర్సిటీ వేదికగా మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనుంది. దాదాపు 22 రోజుల పాటు ఎదురు చూసిన ఉత్కంఠకు తెర పడనుంది. మంత్రాలయం నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో మే 13న పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 2,08,350 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 1,02,155 మంది, మహిళలు 1,06,172, ఇతరులు 23 మంది ఉన్నారు. వీరిలో 1,76,077 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఓట్ల లెక్కింపు 17 రౌండ్ల పాటు సాగనుంది. ఆపై విజేతను ప్రకటించి డిక్లరేషన్ అందజేస్తారు.

వై.బాలనాగిరెడ్డి వైపే మొగ్గు

ఇప్పటికే మూడు పర్యాయాలు విజయం సాధించిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నాల్గవసారి విజయం సాధించడం ఖాయమని ఎగ్జిట్ పోల్స్ పేర్కొంటున్నాయి. టీడీపీ తరపున పోటీ చేసిన ఎన్.రాఘవేంద్రరెడ్డికి నిరాశ తప్పదని అంచనా వేస్తున్నారు. బాలనాగిరెడ్డికి బలమైన క్యాడర్ ఉండడంతో పాటు ప్రజల్లో మంచి విశ్వాసం ఉండడం ఆయన విజయానికి సోపానాలుగా మారనున్నాయని పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు.



మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణయ్య

గోనెగండ్ల: ఎన్నికల కోడ్, 144 సెక్షన్, పోలీస్ 30 యాక్టు అమల్లో ఉన్న నేపథ్యంలో మంగళవారం కౌంటింగ్ తరువాత సభలు, సమావేశాలు, సంబరాలు, ర్యాలీలు, బాణసంచా కాల్చడం నిషేధమని సీఐ రామకృష్ణయ్య స్పష్టం చేశారు. ఆయన సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ.. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉదయం నుంచే ప్రారంభం అవుతుందని, ఆ తర్వాత ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో రౌడీ షీటర్లపై, అనుమానితుల పైన ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. మొబైల్ పోలీస్ టీమ్, పికెట్ టీమ్‌తో గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అనవసరంగా రోడ్ల మీదకు రాకుండా ఇళ్లలోనే ఉండి టీవీల్లో కౌంటింగ్ వివరాలు తెలుసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గోనెగండ్లలో 34.2 మి.మీ వర్షం

గోనెగండ్ల: మండలంలో ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడుతున్న మండల ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. రాత్రి ఉన్న ఫలంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మబ్బులు ఆవరించాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. రాత్రి నుంచి కురిసిన వర్షం 34.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. రహదారులపై వర్షపు నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్‌లో వ్యవసాయ పనులకు అనుకూలంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

చెస్ విజేతలకు మెడల్స్ ప్రదానం



మెడల్స్ అందుకున్న విజేతలతో నిర్వాహకులు

ఆదోని టౌన్: స్పార్క్ చెస్ అకాడమీ, సాయిజ్యోతి నేత్రదాన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక అక్షరశ్రీ స్కూల్‌లో నిర్వహించిన చెస్ టోర్నమెంట్ పోటీలు సోమవారం విజయవంతంగా ముగిశాయి. ముఖ్య అతిథులుగా సాయిజ్యోతి నేత్రదాన ఫౌండేషన్ అధ్యక్షుడు కొల్లి శ్రీధర్, కార్యదర్శి పెండేకల్ శివ, కోశాధికారి కాలేపల్లి విశ్వనాథ్, త్రీటౌన్ ఎస్ఐ నాగేంద్ర పాల్గొని మాట్లాడారు. దాదాపు 50 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఇందులో మొదటి బహుమతి దాసరి సుకుమార్, రెండో బహుమతి మంచికంటి జితేష్, 3వ బహుమతి బ్రిజనాథ్ గెలుచుకున్నారు. మిగతా వారికి వారు సాధించిన పాయింట్స్ ఆధారంగా మెడల్స్ అందజేశారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని నిర్వాహకులు సూచించారు. స్పార్క్ చెస్ అకాడమీ సీనియర్ కోచ్ నందకిషోర్, జంబులయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛను సొమ్ము కోసం అష్టకష్టాలు

- బ్యాంకులకు వెళ్లలేక అవ్వతాతలు, దివ్యాంగుల అవస్థలు
- పడుతూ లేస్తూ వెళ్లి సొమ్ము కోసం పడిగాపులు
- వృద్ధులకు శాపంగా టీడీపీ కుట్రలు



ఎస్‌బీఐ బీసీ పాయింట్ వద్ద సొమ్ము కోసం గుమికూడిన పింఛన్‌దారులు

కోసిగి: మండలంలో పింఛను సొమ్ము తీసుకునేందుకు అవ్వతాతలు అష్టకష్టాలు పడుతున్నారు. టీడీపీ కుట్రలతో లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్ అందించే అవకాశం లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జూన్ నెలకు సంబంధించి పింఛన్ల నగదును డీబీటీ ద్వారా నేరుగా బ్యాంకు ఖతాల్లో జమ చేసింది. ఈ సొమ్ము కోసం లబ్ధిదారులు ఖాతా పుస్తకాలు పట్టుకుని బ్యాంక్‌ల చుట్టూ తిరుగుతున్నారు. కోసిగిలో స్టేట్ బ్యాంక్ రెండవ అంతస్తులో ఉంది. వృద్ధులు, వికలాంగులు మెట్లు ఎక్కి దిగలేక పడరాని పాట్లు పడ్డారు. లావాదేవీలు లేని కారణంగా ఎస్‌బీఐలో పింఛను లబ్ధిదారుల ఖాతాలు స్తంభించాయి. కింది భాగాన ఏర్పాటు చేసుకున్న బీసీ పాయింట్ వద్ద నగదు డ్రా చేసుకుందామనుకున్నా, ఖాతాలు స్తంభింపచేయడంతో తప్పనిసరిగా మెట్లు ఎక్కి బ్యాంక్‌కు వెళ్లి రావాల్సి వస్తోంది. అకౌంట్‌కు ఆధార్ అప్‌డేట్ చేయాలని ఓ ఫారం నింపి బ్యాంక్‌లో అందించాలని షరతులు పెట్టారు. దీంతో వృద్ధులు ఫారం పట్టుకుని ఎక్కడి వెళ్లాలో అర్థం కాక అవస్థలు పడుతున్నారు. బయట వ్యక్తులతో దరఖాస్తు రాయించి బ్యాంక్‌లో అందించిన తర్వాత రెండు రోజులు ఆగి రావాలంటూ బ్యాంక్ అధికారులు తిప్పుతున్నారు. కోసిగిలోని వివిధ కాలనీల నుంచే గాక చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం పింఛను లబ్ధిదారులు సొమ్ము కోసం బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. రెండు రోజులు ఆగి రమ్మంటే మళ్లీ ఖర్చు పెట్టుకొని ఆటోలో రావాల్సిందేనా, ఇంకెన్నాళ్లు ఈ కష్టాలు అంటూ అవ్వతాతలు, వికలాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు సిబ్బంది కనికరం చూపి షరతులు లేకుండా పింఛన్ సొమ్ము అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

జగనన్న పాలనలో ఇంటి వద్దకే పింఛను

గత ఐదేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో వలంటీర్ల ద్వారా ప్రతి నెలా 1వ తేదీన వేకువజామున లబ్ధిదారుల ఇంటి తలుపుకొట్టి పింఛన్ సొమ్ము అందించేవారు. ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకుని టీడీపీ కుట్రలు పన్ని వలంటీర్లచే పింఛన్ల పంపిణీని నిలుపుదల చేయించింది. దీంతో గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయాలు చుట్టూ తిరుగుతూ ఉదయం నుంచి రాత్రి వరకు తిండి తిప్పలు మానుకుని పడగాపులు గాసిన రోజులను గుర్తుచేసుకుని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవ్వతాతల కష్టాలు గుర్తించి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము పెంచుతూ ప్రతినెలా ఇంటి వద్దకే పింఛన్ అందించారు. పెద్దకొడుకులా ఆదుకున్న వైఎస్ జగన్ మళ్లీ సీఎం అవుతారని, తమ కష్టాలు తొలగిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



కోసిగి ఎస్‌బీఐ మెట్లు ఎక్కలేక అవస్థలు పడుతున్న వృద్ధురాలు

రెండు రోజులు ఆగి రమ్మన్నారు



మాది పెద్దకడబూరు మండలం బాపుల దొడ్డి గ్రామం. కోసిగికి 8 కి.మీల దూరంలో ఉంది. గత రెండు నెలలుగా పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ చేశారని చెబుతున్నారు. అష్టకష్టాలు పడి రెండో అంతస్తులో ఉన్న బ్యాంక్‌కు వెళ్లాను. ఖాతా స్తంభించిందని, ఆధార్ అప్‌డేట్ చేయాలని చెప్పారు. తెలిసిన వారిని పట్టుకుని దరఖాస్తు రాసి ఇవ్వడంతో రెండు రోజులు ఆగి రమ్మని చెప్పారు. అసలే నడవలేక పోతున్నాను, మరొకరి సాయం తీసుకుని ఆటోలో రావాల్సి ఉంది. బ్యాంకు వాళ్లు ఇలా తిప్పుతున్నారు. మా కష్టాలు తీర్చి ఇంటి వద్దకే పింఛన్ ఇచ్చేలా చూడాలి.

– భీమక్క, బాపుల దొడ్డిగ్రామం

బ్యాంకు మెట్లు ఎక్కలేకపోతున్నాం



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ సొమ్ము అందించేవారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో రెండు నెలలుగా పింఛన్ సొమ్ము బ్యాంకులో వేశారు. సొమ్ము కోసం బ్యాంకు చుట్టూ తిరగలేకపోతున్నాం. బ్యాంకు మెట్లు 30కి పైగా ఉండడంతో ఎక్కి దిగలేక అవస్థలు పడుతున్నాం. ఇలాంటి కష్టాలు రానివ్వకుండా చూడాలి. మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యి పెద్ద కుమారుడిలా మా కష్టాలు తీరుస్తాడని ఆశిస్తున్నాం.

– పార్వతమ్మ, కోసిగి


కర్ణాటక మద్యం స్వాధీనం





స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మినూరురూరల్: పట్టణంలో ముగ్గురు వ్యక్తులు అక్రమంగా కలిగి ఉన్న కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన బోయ తిక్కస్వామి, జయరాం, ఆదర్శ విద్యాపీఠం వద్ద నివాసముంటున్న బోయ గోపాల్‌ను అదుపులోకి తీసుకుని 576 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.37 వేలు ఉంటుందని తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ ముగ్గురిని రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలో ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా వెంటనే తన సెల్ నంబర్ 94409 02579కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు లింగప్రసాద్, గోపాల్, కానిస్టేబుళ్లు శ్రీనివాసగౌడ్, భరత్, నరసింహారెడ్డి, రాధమ్మ, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు







గంగవరం వద్ద పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న రైతు, పత్తి విత్తనాలు నాటుతున్న వ్యవసాయ కూలీలు, జొహరాపురం వద్ద గుంటక పాస్తున్న రైతన్న

నందవరం: నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు కురవడంతో పుడమి తల్లిలో పంటల సాగుతో సందడి నేలకొంది. నిన్నటివరకు వెలవెలబోయిన పొలాల్లో వర్షాల రాకతో రైతులు పంటల సాగుకు సన్నద్ధమయ్యారు. ఆరుగాలం శ్రమిస్తున్న రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు మంజూరు చేసింది. వ్యవసాయం దండగా అన్న నేతల నోళ్లు మూతబడుతున్నాయి. పండగలా వ్యవసాయం సాగాలని ప్రభుత్వం అన్నదాతలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలు రైతుల ఇంట వెలుగులు నింపుతున్నాయి. అలసిన రైతులకు సంక్షేమ పథకాలు అండగా నిలుస్తున్నాయి. సోమవారం మండలంలో 21.8 మీ.మీటర్ల వర్షపాతం నమోదైంది. వానల రాకతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. మండలంలోని నందవరం, పూలచింత, జోహరాపురం, నాగలదిన్నె, చిన్నకొత్తిలి, పెద్దకొత్తిలి, గురజాల, రాయచోటి, నదికై రవాడి, హాలహర్వి, ముగతి తదితర గ్రామాల్లో విత్తన పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌కు వర్షాలు అనుకులంగా కురుస్తుడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నది తీర గ్రామాలు, బోరు బావుల వద్ద దాదాపు 25 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో కురిసిన వర్షాలు సాగు చేసిన పంటలకు ప్రాణం పోయగా సాగు చేయాల్సిన పంటలకు అనుకూలంగా మారటంతో రైతులు విత్తనం విత్తే పనిలో బిజీగా ఉన్నారు. పత్తి, కంది, కొర్ర తదితర పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. మండలంలో దాదాపు 30 శాతం రైతులు పంట సాగును ప్రారంభించారు.